విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 16, జులై 2024

ఏపీ కేంద్రీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి : ఎంపీ

విశాలాంధ్ర-అనంతపురం : ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించారు. జేఎన్టీయూ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రాంగణంలో ఎంపీకి ఉపకులపతి, ఆచార్య ఎస్.ఎ.కోరి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 2018లో యూనివర్శిటీ స్థాపించబడిన ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అభివృద్ధిపై ఎంపీ తీవ్ర ఆసక్తిని కనబరిచారు. విశ్వవిద్యాలయం విద్యా ప్రమాణాల పరంగా సాధించిన పురోగతి జంతులూరులో రాబోయే కొత్త ప్రాంగణానికి సంబంధించి ఎంపీకి ఉపకులపతి ఒక సమీక్షను అందించారు. ఆగస్టులో ప్రారంభమయ్యే తదుపరి సెమిస్టర్ కొత్త క్యాంపస్‌లో ప్రారంభమవుతుందని తెలియజేశారు. విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరంలో అదనంగా 12 కోర్సులను అందిస్తోందని, ఆరు సబ్జెక్టులలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెడుతోందని వివరించారు. ప్రస్తుతం 20 కంటే ఎక్కువ రాష్ట్రాల విద్యార్థులు వర్సిటీలో చదువుతున్నారని తెలిపారు. కొత్త ప్రాంగణం విశేషాలు, సౌకర్యాలు నిర్మాణ స్థితిని వైస్ ఛాన్సలర్ ఎంపీకి వివరించగా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిపిడబ్ల్యుడి అనంతపురం, ఇంజనీర్ ఎం.ఎస్.ఎన్. ఎల్.శ్రీనివాస్ సాంకేతిక వివరాలను తెలియజేశారు. సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సియుఏపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఉమేష్ కుమార్, ప్రొఫెసర్ శీలా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ రైతులను ఆదుకోండి

- పంట పొలాలపై వచ్చు కాలుష్య నివారణపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-అనంతపురం : బొమ్మనహల్ మండలంలో నేమకల్లు, హీరేహాల్ మధ్య 20 సంవత్సరాల క్రితం వెలసిన జేఆర్ఎస్ మెటల్స్ పరిశ్రమ, రామాంజనేయ రావు స్టీల్ ప్లాంట్, ఎస్ఎల్‌వి స్టీల్ ప్లాంట్, ఇలా 5. స్పాంజ్ ఐరన్ పరిశ్రమల వలన రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని , వెంటనే కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని బొమ్మనహల్ మండలం, నేమకల్ సిపిఐ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. మల్లికార్జున ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సి. జాఫర్ సోమవారం కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ ఆ పరిశ్రమలు ప్రభుత్వ నిబంధనలు సరిగా పాటించడం లేదన్నారు . ఈ ఎస్ పి రన్ చేయడం లేదని, ప్లాంటేషన్, సీసీ రోడ్లు, బ్యాక్ ఫిల్టర్ పని చేయడం లేదన్నారు. ప్రథమ చికిత్స లేకపోగా అంబులెన్స్ సర్వీస్ కూడా కరువైందన్నారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి వల్ల గ్రామాల్లో ప్రజలకు చర్మ వ్యాధులు, ఆస్తమా లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. కాలుష్యం వల్ల పొలాలు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు. పొలాలకు దుమ్ము ధూళి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల నిర్వహణకు మేము వ్యతిరేకం కాదన్నారు. పరిశ్రమల యాజమాన్యం చొరవ తీసుకొని ప్రతి రైతు ఏమోతాదులో నష్టపోతున్నారో అంచనా అందరికీ న్యాయం చేయాలన్నారు. పరిశ్రమల యాజమాన్యం మాత్రం పంట నష్టపరిహారం కింద కొంతమందికి ఎకరాకు 1800, నుంచి 2600 రూపాయల వరకు ఇస్తున్నారని, అది కూడా మూడేళ్ల నుంచి మాత్రమే అన్ని పరిశ్రమల నుండి వారిచ్చే పంట నష్టపరిహారం రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. విత్తనాలు, ఎరువులు, మందులు ఇలా అనేక రకాలుగా ఎకరాకు రూ.30 వేల నుండి రూ.50 వేల వరకు ఖర్చు పెడుతున్నారు. ప్రధానంగా పరిశ్రమల పరిధిలోని రైతులు మొక్కజొన్న, సన్ఫ్లవర్, కాటన్, వేరుశనగ, బోరుబావు పంటలు కాయగూరలు తదితర పంటలు పెట్టి జీవనం సాగిస్తున్నారని, ఇప్పటి పరిస్థితుల్లో ఎకరాకు 30 వేల నుండి 40 వేల రూపాయలు పంట నష్టపరిహారం కింద ఫ్యాక్టరీల యాజమాన్యం చెల్లించాలని కోరడం జరిగిందన్నారు. పరిశ్రమల యజమానులు గుజరాత్, తమిళనాడు, రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ చౌకగా భూములు కొనుగోలు చేసి పరిశ్రమలు నడుపుకుంటూ లాభాలు గడిస్తున్నారన్నారు. రైతులకు మాత్రం తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్నారు. రైతులు అప్పులు పాలై పెట్టుబడులు పెట్టలేక, పెట్టిన పంటలు చేతికి రాక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాప్తాడు నియోజకవర్గం ఇంచార్జ్ పి.రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, బొమ్మనహల్, నేమకల్లు సిపిఐ రైతు సంఘం నాయకులు నాగార్జున,తిప్పేస్వామి, మల్లప్ప, పకీరప్ప, రామాంజనేయులు, ప్రశాంత్, గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగును సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ వి.వినోద్ కుమార్

పాంప్లెట్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

విశాలాంధ్ర-అనంతపురం: ఆయిల్ ఫామ్ సాగును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుకు సంబంధించిన పాంప్లెట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ ఆయిల్ ఫామ్ పరిశోధనా సంస్థ వారి సాంకేతిక సహకారంతో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాల్, డి.హిరేహాల్, కనేకల్ మండలాల్లో, ఉరవకొండ నియోజకవర్గం లోని కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగును చేపట్టేందుకు లబ్ధిదారులు గుర్తింపు ప్రక్రియను చేపట్టాలన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ అనుసంధానంతో 100 శాతం బోర్వెల్, డ్రిప్ సౌకర్యం ఉండి ఒక రైతుకు 2 నుంచి 4 హెక్టార్ల వరకు ఆయిల్ ఫామ్ సాగును చేపట్టేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడం జరిగిందని, రియా కంపెనీ, ఎంకే, ఆగ్రోటెక్ కంపెనీ, ఆయిల్ ఎన్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఆయిల్ ఫామ్ సాగు కోసం అలాట్మెంట్ చేయడం జరిగిందన్నారు. ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. మరిన్ని వివరాలు ఉద్యానశాఖ అధికారుల ఫోన్ నెంబర్లను సంప్రదించ వచ్చన్నారు. అనంతపురం డిహెచ్ఓ 7995086792, ఉరవకొండ ఉద్యాన శాఖ అధికారి 7995086998, రాయదుర్గం ఉద్యాన శాఖ అధికారి 7995086997 అనే నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాకు 300 హెక్టార్ల లక్ష్యం కేటాయించగా, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలలోని ఒక్కో మండలానికి 50 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ చేపట్టేందుకు లక్ష్యం కేటాయించామని, హార్టికల్చర్ డిడి ఫిరోజ్ ఖాన్ తెలిపారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎహరిత అనంతలో భాగంగా మన పచ్చని అనంతపురం కోసం.. అంటూ తయారుచేసిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన ప్లాంటేషన్ కార్యక్రమాలు, కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, చెట్ల నిర్వహణ, వాటి సంరక్షణ అంశాలపై తయారు చేసిన పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, హార్టికల్చర్ డీడీ ఫిరోజ్ ఖాన్, ఏపీఎంఐపీడీ రఘునాథరెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాలిక కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

విశాలాంధ్ర-శింగనమల : శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో దళిత మైనర్ బాలికను అత్యాచార యత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, మహిళల పట్ల ఎవరు దురుసుగా అసభ్యకరంగాప్రవర్తించిన ఉపేక్షించేది లేదని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. బాధి కుటుంబాన్ని పరామర్శిస్తానన్నారు. వివరాల్లోకి వెలితే నిన్నటి రోజున 14వ తేదీన అర్ధరాత్రి 12 గంటల సమయంలో తన దృష్టికి వచ్చిందని, ఆ సమయంలోనే వెంటనే స్పందించి సంబంధిత పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఎఫ్ఐఆర్ నమోదు చేసి మైనర్ బాలికపైన అత్యాచారానికి ప్రయత్నం చేసిన వ్యక్తిని వెంటనే రిమాండ్ పంపాలని ఆదేశాలిచ్చానన్నారు. ఇలాంటి ఘటనలో నియోజకవర్గంలో పునరావృతం కాకుండా తగిన కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎస్టీయూ తొలి కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయండి



విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : ఎస్టీయూ జిల్లా తొలి కార్యవర్గ సమావేశం జూలై 17న అనంతపురం పట్టణంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనం సిపిఐ పార్టీ కార్యాలయంలో జరగనున్నదని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లూరు రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, అనంతపురం జిల్లా ఇంచార్జి రాష్ట్ర సహాయ అధ్యక్షుడు సి.నాగరాజు పాల్గొననున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి మార్గాలు, ప్రభుత్వ నిర్ణయాలు మొదలగు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎస్టీయూ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు.

డిగ్రీ ఆరవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల..



విశాలాంధ్ర-జెఎన్‌టియుఏ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ఆరవ సెమిస్టర్ 2024 ఏప్రిల్ పరీక్ష ఫలితాలను సోమవారం రెక్టర్ ప్రో.జి. వెంకట్ నాయుడు , రిజిస్ట్రార్ ప్రో. లక్ష్మయ్య, కంట్రోలర్ డాక్టర్ లోకేష్ ఫలితాలను విడుదల చేశారు. బి ఏ,బి బి ఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ కోర్సు పరీక్ష రాసిన 10906 మంది పరీక్ష రాయగా 8468 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు .77.65 మంది పరీక్షలో పాస్ అయ్యారు. రీవాల్యుయేషన్ చేయించుకోవాలనుకున్న విద్యార్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

విశాలాంధ్ర-యాడికి: మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలని మండల అధికారులు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ భవనంలో ప్రగతి జ్యోతి. వివో గంగోత్రి వివో మహాసభలు మండల స్థాయి అధికారులు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 23-24 సంవత్సరంలో ఆర్థిక లావాదేవీల గురించి గ్రామ ఐక్య సంఘం సభ్యులకు చదివి వినిపించారు. రాబోవు సంవత్సరంలో ఆర్థిక ప్రణాళికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కాశప్ప,ఏరియా కోఆర్డినేటర్ రాజ్య లక్ష్మి, ఏపీఎం, సీసీ లు, అనిమేటర్ లు, సంఘ సభ్యులు, ఎంపీడీవో సావిత్రి, ఏఎన్ఎంలు, గ్రామ ఐక్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా డ్రా చేసిన నిధులపై సమగ్ర విచారణ చేయాలి

-సర్పంచులు, ఎంపీటీసీలు

విశాలాంధ్ర-రాప్తాడు: మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు సాధారణ నిధులను(జనరల్ ఫండ్) దుర్వినియోగం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచులు సాకే తిరుపాలు, పసుపుల లక్ష్మీదేవి, మిడతల శీనయ్య, బండి ఉజ్జినప్ప, ఎంపీటీసీలు జాఫర్ ఖాన్, మోదుపల్లి రవికుమార్ లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాప్తాడు ఎంపీడీఓ కార్యా లయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. గత రెండున్నరేళ్లలో నాటి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి మంజూరు చేసిన నిధులను వెచ్చించకుండా అధికార పార్టీ నాయకులు తమకు కావలసిన వారికి పనులను ఇచ్చి నిధులను ఇష్టానుసారంగా డ్రా చేశారన్నారు. గతంలో డ్రా చేసిన నిధులపై సమగ్ర విచారణ చేసి డ్రా చేసిన నిధులను రికవరీ చేయాలన్నారు. డ్రా చేసిన నిధులపై సమాచారం ఇవ్వడంతో పాటు శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. నిధుల వివరాలను రెండు రోజుల్లో ఇస్తామని ఎంపీడీఓ సమాధానం ఇచ్చారు.

ప్రజా సమస్యలపై సమన్వయంతో ముందుకెళ్దాం

-ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి



విశాలాంధ్ర-రాప్తాడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమన్వయంతో ముందుకెళ్దామని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి అన్నారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ పసుపుల హేమావతి, ఎంపీడీఓ గీతావాణి, వైస్ ఎంపీపీలు హాజరయ్యారు. నిర్వహించారు. ఆయా శాఖల మండలాధికారులు గతంలో జరిగిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ ఖరీఫ్ సీజన్ లో అవసరమైన ప్రతి రైతుకు విత్తన కాయలతోపాటు అర్హులైన రైతులకు ఇన్సూరెన్స్ మంజూరు మంజూరు చేశామని ఏఓ శేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలో తాగునీటికీ ఇబ్బందులేకుండా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కులాయి వేశామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ చెప్పగా పనులు మంజూరు కాకుండానే ఎలా మొదలుపెట్టారని ఎంపీటీసీ జాఫర్, సర్పంచులు మిడతల శీనయ్య, సాకే తిరుపాల్ ప్రశ్నించారు. జేజేయం పనులను మధ్యలో ఆపేదంతో అపరిశుభ్రత నెలకుందని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. జాతీయ ఆహార భద్రతా పథకం కింద లబ్ధిదారులకు రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని డిప్యూటీ తహశీల్దార్ సురేష్ తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం త్వరితగతిన విధులను మంజూరు చేస్తే అభివృద్ధి పనులను మొదలు పెడతామని పీఆర్ జేఈ ఓబులదాస్ తెలిపారు. డ్వాక్రా సంఘాల్లోని ఎస్సీ ఎస్టీ మహిళలకు ఉన్నతి పథకం ద్వారా రూ లక్ష వరకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేస్తామని డిఆర్డిఏ ఏపీఎం నల్లప్ప తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఐదు ఎకరాలు ఉన్న రైతులకు పండ్ల తోటల పెంపకానికి మూడేళ్ల పాటు చేయూతనిస్తామని డ్వామా ఏపీఓ సావిత్రి తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి వివిధ రూపాల్లో సబ్సిడీలు ద్వారా ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తామని హార్టికల్చర్ ఆఫీసర్ రత్నకుమార్ తెలిపారు. రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపడుతున్నామని విద్యుత్ రమాదేవి తెలిపారు.

ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డికాలనీల్లో పర్యటన

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, మౌలిక సౌకర్యాల కల్పన చేపడుతానని హామీ

విశాలాంధ్ర-తాడిపత్రి: పోలీస్ స్టేషన్ సర్కిల్, సిబి రోడ్డు తదితర ప్రాంతాలలో గన్మెన్ లేకుండా ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి హెూటల్ దగ్గర, పూల అంగళ్లు, మోటార్ బైక్ మెకానికుల, చిన్న, పెద్ద తదితర ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో తాడిపత్రి నియోజకవర్గ, పట్టణ ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ప్రజా సమస్యలు పరిష్కారం చేయడానికి కృషి చేస్తానన్నారు. తాడిపత్రి పట్టణానికి తాగునీటి సమస్య, మురుగు సమస్య ఎక్కువగా ఉన్నదని, దీన్ని వెంటనే శాశ్వత పరిష్కారం చేస్తానన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీలో పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అధికంగా పెంచుతామన్నారు. తాడిపత్రి నియోజకవర్గ, పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు జెసి అభిమానులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు ఊత కర్రలు,వాకర్లు పంపిణీ

బాధితులకు ఊత కర్రలు, వాకర్లు, పంపిణీ చేస్తున్న సిహెచ్ఓ దివ్యభారతి

విశాలాంధ్ర-శింగనమల: జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా తరిమెల, శింగనమల ఆరోగ్య కేంద్రంలో సి హెచ్ ఓ దివ్య భారతి ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ బాధితులు రిహాబిలిటేషన్ (పునరావాసం) పంపిణీ చేశారు, దీనికోసం మండల వ్యాప్తంగా ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రభావిత ప్రాంతాల్లో సర్వే నిర్వహించి ముఖ్యంగా పాఠశాలల్లో మరియు ఇంటి ఇంటికి సర్వే నిర్వహించారు, అందులో వివిధ రకముల ఫ్లోరోసిస్ సంబంధించిన అనుమానాస్పద కేసులను గుర్తించి వారికి మూత్ర రక్త పరీక్షలను సేకరించి వాటిని జిల్లా కేంద్రానికి పంపించి నిర్ధారించడం జరిగింది. అవసరమైన వారికి పునరావాస సహాయక చర్యలు చేపట్టి అందులో భాగంగా నడుము బెల్టులు, మెడకు బెల్టులు, వాకర్లు, ఊత కర్రలు అందించారు, ఇలాంటివారికి భవిష్యత్తులో అవసరమైన మేరకు సంబంధిత అధికారులతో మాట్లాడి శాస్త్ర చికిత్సలు కూడా చేయవచ్చని వాటిని ఆరోగ్యశ్రీ సంబంధించిన హాస్పిటల్స్ లలో రెఫర్ చేసి పంపిస్తామన్నారు, అలాగే వారికి సంబంధించిన చికిత్సలు ఉచితంగా అందిస్తామని, త్రాగునీటిలో ఫ్లోరైడ్ శాతం పరీక్షించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉచిత త్రాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. క్లోరైడ్ నివారణకు సంబంధించిన ఆహార పదార్థాలు ఏవి తీసుకోవాలో అందరికీ అవగాహన కల్పించామని . ఈ కార్యక్రమానికి జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు, సిహెచ్ఓ ఎం దివ్య భారతి సూపర్వైజర్ అశ్వర్థ నారాయణ ఏఎన్ఎం శైలజ, ఆశ కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-తాడిపత్రి : పెద్దపప్పూరు మండలంలోని చిన్న పప్పూరు గ్రామంలో వెలిసిన శ్రీ చక్కర భీమ లింగేశ్వర, శ్రీ అశ్వర్థ నారాయణ స్వామి దేవస్థానమును హైకోర్టు జడ్జి కె. శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ఈవో సుబ్రహ్మణ్యం మేళతాళాలతో, పూర్ణ కుంభంతో పురోహితుల మంత్రోచ్చారణతో ఆయనకు సాదర ఆహ్వానం పలికారు. మొదటగా శ్రీ చక్ర భీమ లింగేశ్వర స్వామికి, శ్రీ అశ్వర్థ నారాయణ స్వామికి హైకోర్టు జడ్జి కె.శ్రీనివాస్ రెడ్డి ఆయన శ్రీమతి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం హైకోర్టు జడ్జి కే శ్రీనివాస్ రెడ్డి దంపతులను ఆలయ పురోహితులు, ఈవో సుబ్రహ్మణ్యం శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి శ్రీ చక్ర భీమ లింగేశ్వర స్వామి, అశ్వర్థ నారాయణస్వామి మెమొంటోను అందజేశారు.

కామ్రేడ్ పెద్దయ్యను పరామర్శించిన సీపీఐ అగ్ర నేతలు..

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం నగరంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో వెన్నెముక సర్జరీ చేయించుకుని చికిత్స పొందుతున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ పెద్దయ్యని సోమవారం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణస్వామి, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి వికె కృష్ణుడు,సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లి కామ్రేడ్ పెద్దయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించారు, అనంతరం వైకుంఠం జయచంద్ర చౌదరి, ఆయన కుమారుడు సాయి దీప్ లు కూడా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మొహర్రం వేడుకల్లో అపశృతి

అగ్నిగుండంలో పడి వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-ఉరవకొండ : అనంతపురం జిల్లాలోని ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం పోలికి గ్రామంలో మొహర్రం వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. సోమవారం తెల్లవారు జామున పీర్ల స్వామిని ఎత్తుకున్న లక్ష్మీనారాయణ అనే వ్యక్తి అగ్నిగుండం దాటుతుండగా గుండంలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను హుటాహుటిన ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ప్రజా సమస్యలపై సమన్వయంతో ముందుకెళదాం

- ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

విశాలాంధ్ర-రాప్తాడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమన్వయంతో ముందుకెళ్దామని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి అన్నారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ పసుపుల హేమావతి, ఎంపీడీఓ గీతావాణి, వైస్ ఎంపీపీలు హాజరయ్యారు. నిర్వహించారు. ఆయా శాఖల మండలా ధికారులు గతంలో జరిగిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ ఖరీఫ్ సీజన్ లో అవసరమైన ప్రతి రైతుకు విత్తన కాయలతోపాటు అర్హులైన రైతులకు ఇన్సూరెన్స్ మంజూరు మంజూరు చేశామని ఏఓ శేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలో తాగునీటికీ ఇబ్బందులేకుండా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కులాయి వేశామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ చెప్పగా పనులు మంజూరు కాకుండానే ఎలా మొదలుపెట్టారని ఎంపీటీసీ జాఫర్, సర్పంచులు మిడతల శీనయ్య, సాకే తిరుపాల్ ప్రశ్నించారు. జేజేయం పనులను మధ్యలో ఆపేదంతో అపరిశుభ్రత నెలకుందని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. జాతీయ ఆహార భద్రతా పథకం కింద లబ్ధిదారులకు రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని డిప్యూటీ తహశీల్దార్ సురేష్ తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం త్వరితగతిన విధులను మంజూరు చేస్తే అభివృద్ధి పనులను మొదలు పెడతామని పీఆర్ జేఈ ఓబులదాస్ తెలిపారు. డ్వాక్రా సంఘాల్లోని ఎస్సీ ఎస్టీ మహిళలకు ఉన్నతి పథకం ద్వారా రూ లక్ష వరకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తామని డిఆర్డిఏ ఏపీఎం నల్లప్ప తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఐదు ఎకరాలు ఉన్న రైతులకు పండ్ల తోటల పెంపకానికి మూడేళ్ల పాటు చేయూతనిస్తామని డ్వామా ఏపీఓ సావిత్రి తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి వివిధ రూపాల్లో సబ్సిడీలు ద్వారా ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తామని హార్టికల్చర్ ఆఫీసర్ రత్నకుమార్ తెలిపారు. రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపడుతున్నామని విద్యుత్ రమాదేవి తెలిపారు. వ్యాధుల నిర్మూలనకు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వైద్యాధికారి శివకృష్ణ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెరిగేలా చర్యలు చేపట్టామని ఎంఈఓ తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరత్న తెలిపారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 16, జులై 2024

గుడిసెలు వేసుకున్న పేదలకు న్యాయం చేయాలి

- సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణకు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-హిందూపురం : గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలు హిందూపూర్ రూరల్ కొటిపి రోడ్డులో కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. టీడ్కో ఇండ్ల దగ్గర విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎమ్మెల్యే భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తూ మార్గమధ్యలో పేదలు వేసుకున్న గుడిసెల వద్ద ఆపగా పేదల నుంచి వినతి పత్రం స్వీకరించారు. సీపీఐ హిందూపురం పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ సమస్యను ఎమ్మెల్యే బాలకృష్ణకు వివరించారు. ఆరు నెలల నుండి ఇక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారని, ఇండ్లు లేని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి పేదలకు అండగా నిలబడాలని కోరారు. స్పందించిన బాలయ్య పేదలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, త్వరలో తగు న్యాయం చేయటానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు సమివుల్లా, కమల్, నౌషద్, చాంద్ భాషా, గంగాధర్, లింగప్ప, జిలాన్, జియా, వేణు, బాబా, అధిక సంఖ్యలో ఇళ్లులేని నిరుపేద మహిళలు పాల్గొన్నారు.

మహిళలు నైపుణ్యాన్ని పెంచుకోవాలి ..

విశాలాంధ్ర-కదిరి: మహిళలంతా ఉచిత శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని పెంచుకోవాలని నాబార్డ్ డీడీఎం అనురాధ, ఏ డీసీసీ బ్యాంక్ మేనేజర్ వెంకటా చలం పేర్కొన్నారు. మునిసిపల్ పరిధిలో శుభయశ్రీ శారీస్ ప్రింటింగ్ యూనిట్లో వర్ధ్ సంస్థ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌లలో శిక్షణ పొందిన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ శిక్షణ కాలాన్ని చక్కగా వినియోగించుకొని నైపుణ్యాన్ని పెంచుకోవా లని, ఉపాధి కల్పించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్, టూల్ కిట్ అందజేశారు. నేటి నుండి నుంచి మూడవ బ్యాచ్ 20 రోజుల పాటు శిక్షణ ఉంటుందని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వర్ధ్ సంస్థ ప్రెసిడెంట్ పి.యశోద, ఫైనాన్స్ లిట్రసి మారుతీ తెలిపారు. ఈ ఎస్‌హెచ్‌జి మహిళలు, వర్ధ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-పుట్టపర్తి : ముదిగుబ్బ మండలంలో చుక్కల భూముల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ముదిగుబ్బ సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ప్రజా సమస్యల ప్రజా వేదిక కార్యక్రమంలో కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ 1954 ముందు పట్టా పొందిన పాత పట్టా భూములను అధికారులు 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో అవి చుక్కల్లో పడి గత ఐదు సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్ నోచుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఈ మండలంలో సుమారు 15వేల ఎకరాలకు పైగా చుక్కల భూమి ఉన్నట్లు పేర్కొన్నారని, ఈ పరిస్థితిలో రైతులు తమ ఆర్థిక ఇబ్బందులు నడుమ తమ భూము లను అమ్ముకోలేకపోతున్నారన్నారు. కనీసం తనఖాపెట్టి బ్యాంకులో రుణం తీసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో పాత పట్టా భూములకు శాపంగా మారిన 22ఏ నిషేధిత జాబితా చట్టాన్ని సవరించి తక్షణమే చుక్కల భూములు రిజిస్ట్రేషన్ అయ్యేవిధంగా చర్య తీసుకుని రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తుమ్మల చిన్నప్ప, ప్రసాద్ నాయక్, శంకరయ్య, పలు వురు టీడీపీ నాయకులు మద్దతు పలికారు అన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి ఊరేగింపు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని మేడాపురం రోడ్డు శ్రీ లక్ష్మీ చెన్నకేశవపురం నందు కొలువైన ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుకలు, ముత్యాలమ్మ తల్లి ఊరేగింపు అత్యంత వైభవంగా కార్యక్రమ నిర్వాహకులు నాయన గారి నరసింహారెడ్డి, నాయనా గారి జయలక్ష్మి నాయనా గారి మురళి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని పుష్పక పల్లకిలో దేవాలయం నుండి ధర్మారంలోని ప్రధాన వీధులైన ఎర్రగుంట క్రాస్, బస్టాండు, కాలేజీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, చౌడేశ్వరి గుడి, చక్రవర్తి థియేటర్ పేరు అమ్మవారి ఊరేగింపును నిర్వహించారు. ఈనెల 16వ తేదీ ఉదయం 8 గంటలకు ముత్యాలమ్మ తల్లి బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు గోమాతల ఊరేగింపు, అమ్మవారి ప్రత్యేక పుష్ప అలంకరణ ఊరేగింపు భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ రాష్ట్ర ఉన్నతాధికారులు, హైకోర్టు లాయర్లు పాల్గొన్నారు

కుక్కల దాడిలో 40 గొర్రెలు మృతి

రూ.3 లక్షలు నష్టం.. బాధితుడు ఆవేదన

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని రావులచెరువు గ్రామం గొర్రెల కాపరులు వెంకటనారాయణ బాలకొండ నారాయణస్వామి సుధాకర్ ముగ్గురూ కలిసి 40 గొర్రె పిల్లలను పెంచుతూ జీవనస్తున్నారు. అయితే గ్రామంలోని కుక్కలు అకస్మాత్తుగా 40 గొర్రె పిల్లలపై దాడి చేసి గొంతు కొరికి చంపేశాయి. ఉదయమే పిల్లలను గూడు కింద వేసి గొర్రెలను మేత కోసం తోలుకొని వెళ్ళామని, ఆ సమయంలో కుక్కలు గూడు కింద తోడి అందులో ఉన్న 40 పిల్లలను గొంతు కొరికి చంపేశాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశాడు. ఎన్డీఏ కూటమి నాయకుడు చెన్నారెడ్డి అక్కడికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్ కు, నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరాముకు సమాచారాన్ని అందజేశారు. తదుపరి వారు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధితుడు మాట్లాడుతూ దాదాపు నాకు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే స్పందించి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: వాహనదారులందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక పాటించాలని లాయర్ బాలసుందరి, ట్రాఫిక్ కానిస్టేబుల్ నారాయణస్వామి తెలిపారు. సోమవారం కోర్టు, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మోటార్ వాహన చట్టాల మీద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని, టూ వీలర్‌దారులు హెల్మెట్, ఫోర్ వీలర్ లో బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని తెలిపారు. హెల్మెట్ వాడకంవల్ల ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయం తగలకుండా బయటపడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నియమ నిబంధనలు తెలియని మైనర్లు వాహనాలు నడిపితే ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాదాల నియంత్రణకు ఈ అవగాహన ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు కూడా తమ కుటుంబంతో పాటు పరిసర ప్రాంతాలలో ఉన్న వారికి కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడుపుట, మద్యం సేవించి వాహనాలు నడుపుట చట్టరీత్యా నేరము అని తెలిపారు. రోడ్లపై ఉన్న స్పీడ్ బ్రేకర్లను గమనించుకుంటూ ప్రయాణం చేయాలని, అతివేగంతో పోతే ప్రాణాలు కూడా పోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి కాంత్ రెడ్డి, అధ్యాపకులు, బాలికలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించండి సారూ..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణము, రూరల్ పరిధిలో గల తమ సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్లు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ తాము ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలోనే ఉంటున్నామని, సచివాలయ పనులు కూడా చేస్తున్నామని, అంతేకాకుండా గర్భవతిని హాస్పిటలుకు పిలుచుకొని వెళ్లి సుఖ ప్రసవం జరిగేలా కూడా నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు. గర్భవతుల సమస్యలు పరిష్కరించాలంటే సచివాలయంలో కొంతమంది అడ్డుకోవడం మాకెంతో బాధను కలిగిస్తుం దని తెలిపారు. ఆశా వర్కర్లుగా మేము ఫీల్డ్ లో ఉండాలని గర్భవతులు, బాలింతలు, చిన్న పిల్లలు సర్వేలు, ఇవన్నీ కూడా తామే చేస్తున్నామని తెలిపారు. ఆశా వర్కర్లగా మా విధులతో పాటు మరికొన్ని విధులు కూడా నిర్వర్తిస్తున్న మాకు రావలసిన అదనపు విధుల పైకం ఇంతవరకు రాలేకపోవడం మాకు ఎంతో బాధ కలిగిస్తోందన్నారరు. చాలీచాలని జీతంతో తమ విధులను నిర్వర్తిస్తున్నామని, వ్యాక్సిన్ క్యారీ మేమే తీసుకొని రావాలని వారంలో నాలుగు సార్లు, ఆటోలకే తమ డబ్బులు అయిపోతున్నాయని, ఏఎన్ఎంలు చేయాల్సిన పనులను మాతో చేస్తున్నారని, ఆఫ్టాల్ ఆశా వర్కర్లు అంటూ మమ్మల్ని హేళన చేయడం మాకెంతో బాధను కలిగిస్తోందని తెలిపారు. సర్వేలు అని... యాప్ లో ఏఎన్ఎం పని కూడా తామే చేస్తున్నామని, ఏఎన్ఎం చేయాల్సిన రికార్డులు కూడా తామే చేస్తున్నామని, ఆరోగ్యాలు బాగా లేకపోతే మాకు సెలవులు కూడా ఉండవని మానసికంగా, శారీరకంగా చాలా ఒత్తిడికి గురవుతున్నామని అన్నారు. చాలీచాలని జీతాలతో జీవనం గడుపుట అలా ఉంటే,,, వేధింపులు సరికాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆశా వర్కర్లకు అదనపు పనులకు ఇచ్చే పైకమును వెంటనే చెల్లించాలని, అలాగే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పీసీసీ అధ్యక్షురాలిని కలిసిన రంగన అశ్వత్థ నారాయణ

విశాలాంధ్ర-ధర్మవరం: అధిష్టాన కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ రంగన అశ్వర్థ నారాయణ విజయవాడకు వెళ్లారు. ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా పిసిసి అధ్యక్షురాలు షర్మిలను కలిసి, జిల్లా సమస్యలను వివరించారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ జిల్లాలోని పలు సమస్యలపై వారు చర్చించడం జరిగిందని తెలిపారు. రంగన అశ్వర్థ నారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని చేనేతల, రైతు, భవన నిర్మాణ కార్మికుల, నిరుద్యోగ సమస్యల గురించి మాట్లాడా నని, వాటిపై తన వంతు కృషి చేస్తానని షర్మిల హామీ ఇచ్చారని తెలిపారు. ఇకనుంచి ప్రజా సంక్షేమ పథకాలపై వివిధ వర్గాల ప్రజలకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ అండదండలతో పాటు పోరాటాలు చేస్తామన్నారు.

22న క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్..

- కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని గుట్ట కింద పల్లి ఆర్‌డిటి స్పోర్ట్స్ మైదానంలో ఆర్‌డీటీ ఆధ్వర్యంలో ఈనెల 22 నుండి స్కూల్ క్రికెట్ అండ్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కోచ్‌లు రాజశేఖర్, పృథ్వి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఆసక్తిగల పాఠశాలలు ఈనెల 20వ తేదీలోగా క్రికెట్ అండ్ కబడ్డీ పోటీలకు వేర్వేరుగా జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9985929285 కు గాని,(క్రికెట్ కోచ్ రాజశేఖర్), 9966492540కు (కబాడీ కోచ్ పృథ్వి) సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆర్‌ఎంపీ డాక్టర్లపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-తనకల్లు: కొక్కంటి క్రాస్ లో ఆర్‌ఎంపీ డాక్టర్ల ఆగడాలు రోజురోజుకు పెచ్చు మీరి ప్రజల ప్రాణాలు హరించకపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని అందుకు నిదర్శనం నిన్నటి దినం జ్వరం వచ్చిందని వస్తే ఆమెకు అధికడోసు ఇంజక్షన్ ఇచ్చి నోటిలో నురగ కక్కుకొని చనిపోయేలా చేసిన ఆర్‌ఎంపీ డాక్టర్ అబ్దుల్లా. సీజనల్ వ్యాధులు మొదలయ్యాయి ఏదో ఒకచోట చూపించుకుందామని ఆర్‌ఎంపీల వద్దకు వస్తే వారికి తెలిసీ తెలియని వైద్యం చేసి ప్రజల ప్రాణాలు మీదికి తె స్తున్నారని సిపిఐ నాయకులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తాసిల్దార్ శోభా స్వర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు అయినా విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తాయని వైద్యంపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు రోజుకొక ఆర్‌ఎంపి క్లినిక్ వెలుస్తున్న వారికి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై ఎవ్వరు ప్రశ్నించకపోవడమే ఇలాంటి పరిస్థితులకు దారితీస్తుందన్నారు. ప్రైవేట్ క్లీనిక్‌లపై అధికారులు దృష్టి సారించి అనుమతులు లేకుండా వైద్యం అందించే వారికి, క్లినికులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకుని వైద్య వ్యవస్థను కాపాడాలని కోరారు లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ రెడ్డప్ప, కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప యాదవ్, రైతు సంఘం నాయకులు కరీముల్లా, సిపిఐ నాయకులు రవి, ఆనందు, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భారత్ కి కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళిత మహిళ పైన గుండమ్మ హత్యకు కారణమైన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథ నల్లిలో దళిత మహిళల గుండమ్మ అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ కులం చెందిన భూమి కొనుగోలు చేసినందున ఆమె ఆ భూమిని సాగు చేయడానికి వెళితే ట్రాక్టర్ తో తొక్కించి ఆమెను శ్రీధర్ రెడ్డి, సుబ్బిరెడ్డి ,సోమప్ప, నాగరాజు, లక్ష్మణులు టాక్టర్ తో తొక్కించి హత్య చేయడం జరిగింది, హత్య చేసిన వీరుపై ఎస్సి ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని అదేవిధంగా ఆ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా 50 లక్షలు ఇవ్వాలని ఈ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం కేంద్రంలో బిజెపి పార్టీ మూడోసారి అధికారులు రావడం ఇప్పటికీ దాదాపు రాష్ట్రంలో 20 మంది పైగా హత్యలు దళితులపై కక్షగట్టి దళితులకు ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఇలాంటి హత్యలు హత్యాయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని దళితులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, రమేష్, రాముడు, ఉపాధ్యక్షులు జ్యోతమ్మ, తిప్పన్న, సరస్వతమ్మ, శశికళమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

విశాలాంధ్ర-కదిరి: కదిరి రూరల్ మండల పరిధిలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన నిర్మాణాలను రెవిన్యూ అధికారులు తొలగించారు. మున్సిపాలిటీ, రూరల్ పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై ఉక్కు పాదం మోపాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశించారు. ఇందులో భాగంగానే ముత్యాల చెరువు గ్రామ పొలం ఆర్ అండ్ ఆర్ కాలనీ సమీపంలో సర్వే నంబర్ 87-2లో కోట్ల విలువ చేసే 30సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చెప్పటారు.ఎమ్మెల్యే ఆదేశాల. మేరకు అక్రమ నిర్మాణాలను జేసిబితో తొలగించారు. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నవారికి కొందరు రెవిన్యూ అధికారుల అండదండలతో జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదవానికి రెండు సెంట్లు భూమి ఇవ్వడానికి సవా లక్ష కారణాలు అడిగే రెవిన్యూ అధికారుల పని తీరుపై మండి పడుతున్నారు.

లాజిస్టిక్ పార్కు కోసం సేకరించిన భూమికి త్వరలో నష్టపరిహారం

- ఎకరాకు రూ.17 లక్షల 48 వేల 263 పరిహారం
- మొదట 67 మందికి అందజేత

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ మండల పరిధిలోని గొందిపల్లి పొలంలో ప్రభుత్వము లాజిస్టిక్ పార్క్ కోసం సేకరించిన భూమికి త్వరలో రైతులకు నష్టపరిహారం ఇవ్వనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మొదట విడుదలైన 67 మంది రైతులకు 17 కోట్లు ఇవ్వనున్నారని ఒక్కొక్క ఎకరానికి 17 లక్షల 48 వేల 263 రూపాయల నష్టపరిహారంగా ప్రభుత్వం రైతులకు ఒక ఎకరాకు చెల్లించనున్నారని మొత్తం భూమి 204 .92 ఎకరాల గాను192.53 ఎకరాలకు మాత్రమే నష్టపరిహారం ఇవ్వనున్నారని, ఇంకా ఎనిమిది ఎకరాలకు వివిధ కేసులలోనూ భూమి పెండింగులో ఉన్నందున అలాగే కొంత భూమి రైల్వే, హెచ్ ఎంఎస్ఎస్ ద్వారా మిగులు భూమిగా ఉన్నందున ఎకరాలకు మాత్రమే చెల్లించనున్నారని మొదట విధిగా 17 కోట్లు, రెండో విడత కింద 16,65,40,627 మొత్తాన్ని విడుదల చేయనున్నారని తెలిపారు. మొత్తం ఎకరాలకు రైతులకు అందాల్సిన మొత్తం 33,65,40,627 కోట్లు. ఈ మొత్తాన్ని రెండు విడుదలుగా చేయనున్నారు రైతుల అకౌంట్లకు కలెక్టర్ ద్వారా బ్యాంకులకు నేఫ్ట్ మొత్తం చెల్లించనున్నారని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ పార్కు కోసం గొందిపల్లి, ఇస్లాపురం, హరిపురం, కురుబవాండ్లపల్లి, వెంకట్ రెడ్డి పల్లి, తిమ్మాపురం తదితర గ్రామాల రైతుల భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోనున్నది. ఈ భూమిలో ప్రభుత్వం లాజిస్టిక్ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

బాలికను అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: నంద్యాల జిల్లా పగిడాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 8 ఏళ్ల వాసంతి అనే చిన్నారి పార్కులో ఆడుకొనుచుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ వ్యక్తులు మాయ మాటలు చెప్పి పాపను ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి, తదుపరి చంపేసి కాలువలో పడేయడం జరిగిందని, ఈ హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బహుజన సమాజ్ పార్టీ ధర్మవరం ఇంచార్జ్ సాకే వినయ్ కుమార్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ హత్యాచారం జరిగిన సంఘటన చాలా బాధాకరం అమానుషమని, తక్షణమే ప్రభుత్వము స్పందించి హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. లేనిపక్షంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలవాలని ఇదే సంఘటన అగ్రకులాల్లో జరిగింటే హుటా హుటిన అన్ని చర్యలు చేపట్టి వారు అని తెలిపారు. బీసీ కులం కాబట్టే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు దుయ్యబట్టారు. ముమ్ముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు గైకొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలను తక్షణమే అందించాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు తక్షణమే అందించా లని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్య దర్శి అరుణ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గణేష్ కూడలిలోని సిపిఐ పార్టీ కార్యాలయంలోవారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో,పాఠశాలలో చదువుతున్న పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. 2024-25 విద్యా సంవత్సరంకు సంభందించి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సరిపడ పాఠ్య పుస్తకాలు అందించడం లో విఫలమైందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యి నెల దాటిన ఇంకా పూర్తి స్థాయిలో విద్యార్థులకు పుస్తకాలు అందించక పోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.దీంతో అధ్యాపకులు సరిఅయిన సమయానికి సిలబస్ పూర్తి చేయలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి గౌతం, మధన్, చరణ్ కుమార్, మహ్మద్ రఫీ, రమేష్, సురేష్, విజయ్, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెడ్ల పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశవ శంకర్రావు 68వ జన్మదిన వేడుకలు సందర్భంగా రోగులకు బ్రెడ్లను పంపిణీ చేశారు. తొలుత కాలేజీ సర్కిల్ వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద విగ్రహానికి పూలమాలవేసి, తదుపరి కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీసీ కులాలు అందరూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని జిల్లా అధ్యక్షులు నామాల శంకర్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు ఆధ్వర్యంలో బీసీ కులస్తులకు న్యాయం జరిగేలా అనేక పోరాటాలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్రాజు రవి, బోయ రవిచంద్ర, అధిక సంఖ్యలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - అగళి : అగళి మండలం రామనపల్లీ పంచాయితీ లోని రామనపల్లి, కసాపురం గ్రామానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు వైసీపీ నీ వీడి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, జడ్పీటీసీ ఉమేష్, నాయకులు శ్రీనివాస్ ఆచార్, డాక్టర్ కృష్ణప్ప, రవికుమార్ , శివన్న ఆధ్వర్యంలో టీడీపీ కండువా వేసుకుని పార్టీలో చేరారు. కసాపురం గ్రామానికి చెందిన వైసిపి వార్డు మెంబర్ మహాదేవప్ప, హనుమంతు, భూతన్న, రంగస్వామి, రామనపల్లె కి చెందిన రంగనాథ్ గంగాధర్, హనుమంతప్ప, నాగేంద్ర, రమేష్ తదితరులు టీడీపీ ప్రభుత్వం వంద రోజుల పాలనలో అమలు పరస్తున్నా సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరామని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకంఠ ,రాజన్న, ఫీల్డ్ అసిస్టెంట్ రఘు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 16, జూలై 2024

త్వరితగతిన సమస్యలకు పరిష్కారం చూపించాలి-జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి 380 అర్జీలను స్వీకరించడం జరిగింది. అక్కడికక్కడే జిల్లా అధికారులతో మాట్లాడి అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల విషయమై జిల్లా అధికారులంతా ప్రత్యేక దృష్టి సారించి వాటిని ఎలా పరిష్కరించాలో దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపించాలన్నారు. సమస్యలను స్వయంగా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా, మండల స్థాయి అధికారులు ఖచ్చితంగా హాజరుకావాలన్నారు. అధికారులు అనుమతి తీసుకుని సెలవులు పెట్టుకోవాలని, అందరూ క్రమశిక్షణతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతివారం అర్జీదారులు తగ్గుతున్నారా, పెరుగుతున్నారా అనేది పరిశీలించాలని, ఏ శాఖ పరిధిలో ఎవరికి ఎన్ని అర్జీలు వచ్చాయనే దానిపై రిపోర్టులను అందించాలన్నారు. ఎక్కువ అర్జీలు వచ్చిన కార్యాలయాలను తాము తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. అర్జీలు ఎక్కువ ఎందుకు వచ్చాయి అనే దానిపై పరిశీలించాలని, ఎక్కడ సమస్య ఉందో పరిశీలించుకుని అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని స్టాండర్డ్ అర్జీలపై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్లు (ఎస్ఓపి) కరదీపికలను తయారు చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, పాఠశాలల్లో సీట్లు, విద్యార్థుల ట్రాన్స్ఫర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడం, జాబ్ కావాలి, తదితర అంశాలకు సంబంధించి ఎస్ఓపిలను వెంటనే సిద్ధం చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, ల్యాండ్, సివిల్ సప్లైస్, అగ్రికల్చర్, హార్టికల్చర్, తదితర శాఖలకు సంబంధించి జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తారని, విద్య, సర్వ శిక్ష అభియాన్, ఆర్డబ్ల్యూఎస్, వెల్ఫేర్ శాఖలకు సంబంధించి జిల్లా పరిషత్ సీఈవో, మెప్మా, అర్బన్ పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ శాఖలు, హెచ్ఎల్సి, హెచ్ఎన్ఎస్ఎస్ తదితర శాఖలు నగరపాలక సంస్థ కమిషనర్, డిజాస్టర్ మేనేజ్మెంట్, పబ్లిక్ గ్రీవెన్స్, తదితర శాఖలకు సంబంధించి డిఆర్ఓ పర్యవేక్షిస్తారని, వారు ఆయా శాఖల వారీగా వచ్చే 72 గంటల్లోగా వారి పరిధిలోని ప్రభుత్వ పథకాలు, పీఎం ముద్ర, నెడ్ క్యాప్, అన్ని రకాల పథకాలపై సమావేశాలు నిర్వహించి రోజువారీగా రిపోర్టులను అందజేయాలన్నారు. వచ్చే వారంలో ఎంఈఓలతో టీంలను ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయించాలని, వాటిలో లోపాలను గుర్తించాలని డిఈఓని ఆదేశించారు. అధికారులంతా చిత్తశుద్ధితో తమ బాధ్యతలను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్డిసి శిరీష, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాష, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజారావు, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, డిఈఓ వరలక్ష్మి, డీఆర్డీఏ పిడి ఈశ్వరయ్య, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, హార్టికల్చర్ డిడి ఫిరోజ్ ఖాన్, సెబ్ అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, బీసీ వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, ఎల్డిఎం నర్సింగ్ రావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా. కిరణ్ కుమార్ రెడ్డి, డీఎస్ఓ శోభారాణి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రసూల్, సర్వే ఏడి రూప్ల నాయక్, చేనేత జౌళి శాఖ ఏడి అప్పాజీ, మార్కెటింగ్ ఏడీ చౌదరి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం : డాక్టర్ శివకృష్ణ

విశాలాంధ్ర-రాప్తాడు: కుష్టు వ్యాధి రాకుండా దానిని నిర్మూలనకు సమన్వయంతో కృషి చేద్దామని వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ సూచించారు రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య సిబ్బందికి కుష్టు వ్యాధి, దాని లక్షణాల గురించి అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి అనేది ప్రాణాంతకమైన వ్యాధి కాకపోయినా నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యాన్ని కలిగించే మహమ్మారి అన్నారు. గతంతో పోల్చుకుంటే కుష్టు తగ్గిపోయినా ఇటీవల ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. చర్మంపై స్పర్శ లేని, నొప్పి లేదా చర్మంపై దురదలు లేని మచ్చలు వస్తాయన్నారు. చర్మంపై ఎర్రని లేదా రాగి రంగు మచ్చలు, చెవులు వీపు ఎదపై నొప్పిలేని బుడిపెలు వస్తాయన్నారు. కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు ఊడిపోవడం, నరములు నొప్పిగా ఉండడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. చేతులు పాదాలలో నొప్పిలేని గాయాలు లేదా పుండ్లు రావడం తదితర ఇతర లక్షణాలు ఉంటాయన్నారు. ప్రతి గ్రామంలో ఒక ఆశా, వాలంటీర్ కలసి ప్రతి రోజు 20ఇళ్ల వరకు సర్వే చేసి లెప్రసీ వ్యాధిని గుర్తిస్తారన్నారు. , ప్రాథమిక దశలోనే నివారణకు వైద్యాధికారిని సంప్రదిస్తే గుర్తించి తగిన మందులు ఉచితంగా మొదలు పెడతారన్నారు. ఇందులో 6 నెలలు, 12 నెలల కోర్సు ఉంటుంది. వ్యాధి ప్రభావాన్ని బట్టి నిర్ణయిస్తారు. కార్యక్రమంలో సిహెచ్ శివప్రసాద్, సూపర్వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వారపు సంత వేలం పాట

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండల కేంద్రమైన బొమ్మన హాల్ లోని ప్రతి శుక్రవారం వారపు సంత సుంకం వసూలు కు సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. ఈపిఓపిఆర్డీ దాన్ సమక్షంలో వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన పి. ప్రశాంత్ వారపు సంత సుంకం రూ.1.50 లక్షకు దక్కింది. ఈ వేలం పాటలో ఐదు గురు పాల్గొనగా విరుపాక్షి లక్షకు పాడడంతో పి ప్రశాంత్ రూ. 1.50 లక్షల పలికి దక్కించుకున్నాడు. పయ్యావుల మోహన్ బాబు , పంచాయతీ కార్యదర్శి ఫక్రుద్దీన్, టిడిపి నాయకులు పయ్యావుల అనిల్, లాలూస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల వలనే మహిళల్లో ఆర్థిక సాధికారత

విశాలాంధ్ర-ఓబుల దేవర చెరువు : దేశంలోనే మొట్టమొదట మహిళల ఆర్థిక సాధికారత సాధించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగాఉన్న నారా చంద్ర బాబు నాయుడు 1996లో డ్వాక్రాసంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా ఎ లాంటి గ్యారంటీ లేకుండా

లక్షలాది రూపాయలు రుణాలు మంజూరు చేసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టా రని మండల టీడీపీ కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టాఓబులరెడ్డి,ప్రధాన కార్యదర్శి పీట్లసుధాకర్ తదితరులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవన్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలను మహిళ సంఘాలకు మంజూరు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారన్నారు. అదేవిదంగా గతంలో వున్న చంద్రన్న భీమా పాలసీ ద్వారా పేద,మధ్య తరగతి కుటుంబాలకు కొండంత అండ కాగలదని తెలిపారు. ప్రభుత్వం డ్వాక్ర మహిళలకు అందిస్తున్న ఆర్థిక చేయుతతో స్వయంసమృద్ధి సాధించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీఎం రమనప్ప,డా,,జాకీర్ అహమ్మద్, అంజినప్ప,సర్పంచ్ శంకరరెడ్డి,ఎంపీటీసీ శ్రీనివాసులు,సీసీలు చంద్రారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం మండలం ప్రెస్క్లబ్ నూతన కమిటీ ఎంపిక

విశాలాంధ్ర-గుడిబండ: మడకశిర నియోజకవర్గం లోని అమరాపురం మండలంలో ప్రింట్ అండ్ ఎల క్ట్రానిక్ మీడియా నూతన కమిటీని అమరాపురం మండల పాత్రికేయులు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షులుగా బి.తిమప్పను, ఉపాధ్య క్షులుగా బి.శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా బి.నాగరాజు, కోశాధికారిగా ఎస్.మోహన్కుమార్, గౌరవ అధ్యక్షులుగా ఎస్.హనుమంతరాయప్ప, గౌరవ సలహాదారునిగా తమ్మడేపల్లి సిద్దేశ్,ను కార్య వర్గ సభ్యులుగా హనుమంతరాజు, మంజునాథ్,రాజు, హనుమంతరాయప్ప,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతనంగా ఎంపికైన అధ్యక్షులు తిమ్మప్ప మాట్లాడుతూ మండలంలోని వివిధ పత్రికల్లో పనిచేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు ఏకగ్రీవంగా నన్ను ఎన్నుకున్నందుకు వాళ్ళందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటు న్నానని. అలాగే మండలంలోని పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలపై తాను ఎల్లప్పుడూ ముందుండి వారి సలహా సూచనలతో వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని అదేవిధంగా పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు,ఇల్లు మంజూరు, పాత్రికేయులకు 5 ఎకరాల భూమి తదితర సమస్యలపై పోరాడి పాత్రికేయుల సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నూతనంగా ఎంపిక కాబడ్డ వివిధ పత్రికల్లో పని చేస్తున్న ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

కార్మికుల ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-కొత్తచెరువు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సత్యసాయి జిల్లా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ తెలిపారు. కొత్తచెరువులోని టీటీడీ కళ్యాణ మండపం ఆవరణంలో సిఐటియు మండల అధ్యక్షులు ముత్యాలు, ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, హమాలీలు, పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయనందుని, ప్రజలు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కార్మికులు ఉద్యోగులు సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం వివిధ ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ పనిచేస్తున్న కార్మికులను తొలగించడానికి సిద్ధమవుతున్నారని, అలాంటి వాటికి స్వస్తి పలకాలన్నారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచాలన్నారు. బిజెపి ప్రభుత్వం అన్ని సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధమవుతుందన్నారు. అసాంఘిక కార్మికులకు సమగ్రమైన చట్టాలను ప్రభుత్వాలు చేయాలన్నారు. 44 కార్మికుల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తొలగించి నాలుగు కోడులుగా ఏర్పాటు చేసిందన్నారు. ఇలా చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. ఈ చట్టాలను రద్దు చేయాలని వారు కోరారు. అనంతరం సిఐటియు నూతన మండల కమిటీని ఏకగ్రీయంగా ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్ గా ముత్యాలు, కో కన్వీనర్లుగా శంకర్ రెడ్డి, షర్మిల, 17 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బేల అంజి, పెద్దన్న, చెన్నకేశవులు, భగవంతు, ఓబులేసు, అంగన్వాడీ కార్యకర్తలు రాదా, నాగమణి, మరియు ఆశా కార్యకర్తలు, హమాలీలు, పాల్గొన్నారు.

దళిత కుటుంబాన్ని ఆదుకోండి.

విశాలాంధ్ర-కూడేరు: ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్ మండలం హావలిగి గ్రామంలో అర్ధరాత్రి వర్షం కురవడంతో కుటుంబం నిద్రిస్తున్న ఇల్లు ప్రమాదపు వచాస్తూ కుప్పకూలిందని ఆ ఇంటిలో నిద్రిస్తున్న దళిత దంపతులు ఇద్దరు మరణించడం జరిగిందని ఇద్దరు పిల్లలు తీవ్ర గాయాలతో బయటపడ్డారని ఆ పిల్లలకు మెరుగైన వైద్యం అందించి అనాథలైన ఆ పిల్లలను భవిష్యత్తులో చదువు బాగోగులను ప్రభుత్వమే బాధ్యతగ చూడాలని, తక్షణ సాయంగ పది లక్షల రూపాయలు ఇవ్వాలని, అలాగే ఎక్స్గ్రేషియా 50 లక్షలు ఇచ్చి భవిష్యత్తులో ఆ పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండ చూడాలని విహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న ప్రభుత్వాన్ని కోరారు.

టిడిపి నాయకులు చొరవ

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలోని కురువల్లిలో రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో వీధుల్లో ఉన్న రోడ్లు బురదమయంగా మారడంతో సోమవారం స్థానిక టిడిపి నాయకులు సుదర్శన్ రెడ్డి, ఏం తిప్పేస్వామిలు చొరవ చూపి గ్రావెల్ తోలించారు. ప్రస్తుతం మొహరం వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో పీర్ల చావుడికి వెళ్లేందుకు భక్తులకు, పీర్ల ఊరేగింపులో ఇబ్బందులు కలుగుతున్నాయని టిడిపి నాయకులు సొంత ఖర్చులతో ట్రాక్టర్లు ద్వారా గ్రావెల్ తోలించారు. గుంతలుగా ఉన్న రోడ్లను గ్రావెల్తో పూడ్చివేశారు. ఎంతో స్థానికులు అభినందించారు.

ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలి..జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-అనంతపురం: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పిలుపునిచ్చారు. సోమవారం హరిత అనంత ప్లాంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణంలో జరిగిన ప్లాంటేషన్ ప్రోగ్రాంలో జిల్లా కలెక్టర్ మొక్క నాటి నీరు పోశారు. అలాగే జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.ఈబి.దేవి మరియు ఇతర అధికారులతో పాటు కార్యాలయ సిబ్బందితో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని, ఆ మొక్క సంరక్షణ కూడా స్వీకరించి అవి పెరిగి పెద్దయి మహా వృక్షాలు కావడానికి బాధ్యత తీసుకోవాలన్నారు. తద్వారా జిల్లా హరిత అనంతగా కావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణంలో మొక్కలు నాటించాలని డిఎంహెచ్ఓని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. నేను ఈరోజు డిఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణంలో మొక్కను నాటుతున్నాను. ఈ మొక్కను శ్రద్ధగా పరిరక్షిస్తానని, ప్రతిరోజు నీరు పోసి మహా వృక్షం అయ్యేందుకు నిరంతరం శ్రమిస్తానని, నా బిడ్డలతో సమానంగా నేను నాటిన ఈ మొక్కలను కాపాడుతానని, నేను ఈ మొక్కల యొక్క ఫలాలను దేశానికి చేకూరేలా చేస్తానని మనసా వాచా కర్మనా ప్రమాణము చేస్తున్నాను అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. సుజాత, డా.యుగంధర్, డా.అనుపమ, డా.నారాయణస్వామి, డా. రవిశంకర్, డా. గంగాధర్ రెడ్డి, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్ రావు, జిల్లా మలేరియా అధికారి ఓబులు, స్టాటిస్టికల్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, ఆఫీస్ సూపరింటెండెంట్స్ విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, సురేష్ కుమార్, పవన్, కమలాకర్ రాజు, లక్ష్మన్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ఓటమిని జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకున్న ప్రకాష్

విశాలాంధ్ర-మడకశిర : అతనొక కరుడు గట్టిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి వీరాభిమాని ఉమ్మడి జిల్లాల్లో జగన్ ఎక్కడికి వచ్చినా జగన్మోహన్ రెడ్డిని చూడకుండా ఉండేవాడు కాదు.నియోజకవర్గంలో సైతం ఎక్కడ వైసీపీ సమావేశాలు జరిగినా అందులో పాల్గొని తన మద్దతును వైసీపీకి తెలిపేవాడు. అయితే ఇటీవలే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందడంతో తీవ్ర మనస్థాపానికి గురైన చందకచర్ల పంచాయతీ అచ్చంపల్లికి చెందిన బోయ రామంజప్ప అల్లుడు ప్రకాష్ (36)గత నెల 4వ తేదీన సాయంత్రం చందకచర్ల పంచాయతీ పొలిమేర్లలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ విషయాన్ని ఇటీవలే తెలుసుకున్న వైకాపా ఇన్చార్జ్ ఈరలక్కప్ప సోమవారం అచ్చంపల్లి గ్రామంలోని మృతుడు ప్రకాష్ నివాసానికి వెళ్లి కుటుంబాన్ని ఓదార్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాష్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు.మృతుడికి భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు.పిల్లలను మంచి స్కూళ్లలో చేర్పించి వారి బాగోగులను చూసుకుంటానని హామీ ఇచ్చారు.ఎంపీటీసీ గోపాల్ నాయక్,నాయకులు కే పి దివాకర్,కమ్మర మూర్తి,కొత్తలం నాగరాజు,శేషాద్రి,కాలే నాయక్,రవి,దాసన్న,విజయ్ కుమార్,తిప్పన్న,వార్డు మెంబర్లు మంజునాథ్, రమేష్,శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిపోయిన పనులు మొదలు పెట్టాలి...జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఆగిపోయిన పనులను వెంటనే మొదలు పెట్టాలని జిల్లా కలెక్టర్ డా.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో పంచాయతీరాజ్ శాఖపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని ఎన్ఆర్ఈజిఎస్, ఎస్డిపి, 15 ఫైనాన్స్, అంగన్వాడి భవనాలు, బిఎంసియులు, డిజిటల్ లైబ్రరీలు, ఏసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, సిసిరోడ్లు, వివిధ రహదారుల నిర్మాణానికి సంబంధించిన పనులను వెంటనే మొదలుపెట్టి సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే శనివారంలోపు పీఎంజిఎస్వై కింద రాయదుర్గం - భూపసముద్రం, ఉరవకొండ - కనేకల్లు, తదితర రహదారుల నిర్మాణం మొదలుపెట్టాలని, ఏవైనా సమస్యలు ఉండే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులను వెంటనే ముందుకు తీసుకెళ్లాలని, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పనులను చేపట్టాలని సూచించారు. రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదని, పనులను కేటాయించిన గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ కెవికెవి.ప్రసాద్, ఈఈ చంద్రశేఖర్, డిఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - అగళి : మండల పరిధిలోని రామనపల్లి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న హట్టి కరియమ్మ దేవత దేవాలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా జడ్పీటీసీ ఉమేష్ అచార్, అతని సోదరులు అగళి గోల్డ్ మర్చాంట్ శ్రీనివాస్ ఆచార్ రూ. 10,000 విరాళాన్ని మడకశిర నియోజకవర్గ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా అందజేశారు.మడకశిర తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో సోమవారం ఉదయం నియోజకవర్గ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి ని అగళి మండల నాయకులు కలిశారు. ఈసందర్భంగా ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన జడ్పీటీసీ ఉమేష్ ఆచార్ శ్రీనివాస్ ఆచార్ లకు రామనపల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించండి

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రంలో, పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను దాదాపు నెల రోజులకు పైగా నిలిపివేయడంతో జీవనోపాధి కోల్పోయి కూలీలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నామన్నారు. గతంలో పనిచేసిన రెండు నెలల బిల్లులు పెండింగ్లో పెట్టారని, చేసిన పనులకు బిల్లులు చెల్లించక, చేయడానికి పనిని కల్పించకపోతే మేం ఎలా బ్రతకాలని, అమడగూరు ఉపాధి కూలీలు కూలీలు భాష, వెంకటరమణ, దొడ్డం కిష్టప్ప, బోనాల మాబు, హుస్సేన్, కిష్టప్ప, సూరి, నరసింహులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల కోసం అనేకమంది పోటీలు పెడుతూ ఉపాధి పనులు నిలిపివేసి, కూలీల బ్రతుకులతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మాకు ఉపాధి హామీ పనిని కల్పించకపోతే వందలాదిమంది గ్రామాలు వదిలి జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్ళవలసి వస్తుందన్నారు. మాకు వెంటనే పనిని కల్పించాలని గ్రామస్తులు కోరారు.

కొత్తచెరువుకు చేరుకున్న సత్యసాయి భక్తులు

విశాలాంధ్ర-కొత్తచెరువు: ఆషాడ ఏకాదశి సందర్భంగా మహారాష్ట్రకు చెందిన సత్యసాయి భక్తులు ధర్మవరం నుండి పాదయాత్రగా సోమవారం సాయం కాలానికి కొత్తచెరువుకు చేరుకున్నారు. వీరికి సత్యసాయి బాబా సేవ సమితి వారు స్వాగతం పలికారు. భక్తులు సత్యసాయి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి భజనలు చేసుకుంటూ మహిళలు, వృద్ధులు, వందలాదిమంది పాదయాత్ర నిర్వహించారు. వీరు ప్రతి ఏడాది ఆనవాయితీగా ఆషాడ ఏకాదశి రోజు సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్నారు. వారు ఆనవాయితీగా ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ట్రిబుల్ ఐటీ కి విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని గుట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నరేష్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం నాగార్జున తెలిపారు, గతేడాది పది పరీక్షల నందు 600 మార్కులకు గాను 568 మార్కులు సాధించినందున ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ ఐటి ప్రవేశాల సెలక్షన్స్ లో ఈనెల 22 ,23, ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ లో చేరనున్నట్లు ఎంపిక జాబితాలో నరేష్ పేరు ఉన్నట్లు విద్యార్థి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం ,గ్రామస్తులు అభినందించారు. తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు, విద్యార్థికి అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలని వినతి

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువు మండలంలో సీజనల్ వ్యాధులు అయిన డెంగ్యూ, అతిసార వ్యాధులు, టైఫాయిడ్, మలేరియా, వ్యాపిస్తున్నాయని వాటిని తక్షణమే అరికట్టాలని తాహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ కళావతికి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఈ సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం మురికి నీరు పోయడం దీని వలన దోమలు అధికమై ఈ జ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. అదే విధంగా వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం అందులో బ్లీచింగ్ పౌడర్ కలపకపోవడంతో దీనితో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అనేక మంది ప్రజలు అనారోగ్యానికి గురై ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఈ సిఐటియు నాయకులు అంజి, ముత్యాలు, పెద్దన్న ,శంకర్ రెడ్డి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లు అందజేయాలి

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో ముగ్గురు విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్ల (ఆర్టిఫిషియల్ లెగ్స్)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పంపిణీ చేశారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పుట్లూరు మండలం కందిగోపుల గ్రామానికి చెందిన వెంకట రామయ్య, ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన ఓబులమ్మ, గుత్తి ఆర్ఎస్ కు చెందిన భాగ్యమ్మ అనే ముగ్గురు విభిన్న ప్రతిభావంతులకు ఒక్కొక్కటి 3 వేల రూపాయలు విలువ చేసే కృత్రిమ కాళ్లను మరియు వెయ్యి రూపాయలు విలువచేసే చేతి కర్రలను జిల్లా కలెక్టర్ వారు కూర్చున్న చోటుకే స్వయంగా వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లు అందజేసేందుకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వికలాంగుల సంక్షేమ శాఖ ఎడిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి రసూల్, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పెద్దయ్యనిపరామర్శిస్తున్న సీపీఐ అగ్రనేతలు

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం నగరంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో వెన్నెముక సర్జరీ చేయించుకుని చికిత్స పొందుతున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ పెద్దయ్యని సోమవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణస్వామి, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి వికె కృష్ణుడు,సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లి కామ్రేడ్ పెద్దయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించారు, అనంతరం వైకుంఠం జయచంద్ర చౌదరి, ఆయన కుమారుడు సాయి దీప్ లు కూడా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మొహరం పండుగకు రావాలని మంత్రికి ఆహ్వానం

విశాలాంధ్ర-పెనుకొండ : మొహరం షహదత్ పీర్ల పండుగ జల్ది సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 17వ తేదీ బుధవారం స్థానిక బాబయ్య స్వామి చెరువులో ప్రతి సంవత్సరం లాగా ఈసారి కూడా పెద్ద ఎత్తున పీర్ల స్వాముల ఊరేగింపు, జల్ది కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేయాలని పేనుకొండ శాసనసభ్యురాలు మరియు రాష్ట్ర బీసీ సంక్షేమం చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మను ,ఆహ్వానించడానికి దర్గా పీఠాధిపతి తాజ్ బాబా, వారి స్వగృహానికి వెళ్లగా మంత్రి విజయవాడలో ఉన్నందున ఆమె భర్త వెంకటేశ్వరరావుకు, ఆహ్వాన పత్రికను అందించి కార్యక్రమానికి విచ్చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు దాదు, బాబా, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన మొక్కలు అందించాలి-జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-రాప్తాడు: రైతులకు నాణ్యమైన అరటి మొక్కలు సరఫరా చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. సోమవారం సాయంత్రం రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి సమీపంలోని ఎంఎస్ఎంఈ పార్కులో ఉద్యాన శాఖ ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన అరటి పిలకలు ఉత్తతి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కేంద్రంలో ఏడాదికి 25 లక్షల అరటి మొక్కలు ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయడం అభినందనీయం అన్నారు. ఇక్కడ గ్రాండ్ నైన్, సుగంధాలు, యాలకి, కర్పూర అరటి, చెక్కర కేళి వంటి అరటి రకాలు ఉతప్పత్తి చేస్తున్నామని నిర్వాహకులు తెలియజేశారు.. ఇలాంటి మరికొన్ని యూనిట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.. అనంతపురం జిల్లా రాష్ట్రంలో అరటి ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉందన్నారు. మన జిల్లా నుండి అరటి విదేశాలకు ఎగుమతులు వెళుతున్నాయని... దీని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్ ఖాన్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథ్ రెడ్డి, రాప్తాడు ఉద్యాన అధికారి రత్న కుమార్ పాల్గొన్నారు.